# శ్రీబాబు

'వల్లరి'

పన్నెండు నెలలకు అంటే సరిగా సంవత్సరానికి తిరిగి శ్రీబాబు యింటికి వెళ్లాను. అప్పటికి ఇప్పటికి యెంతో మార్పు కనబడింది ఆ ఇంట్లో. కుర్చీలు, సోఫాలు, బల్లలు, ఫ్లవర్ పాట్సు, కర్టన్సు — అన్నీ వాటివాటి స్థానాల్లో సొగసుగా అమర్చబడివున్నాయ్. నేనలా ఫ్రంటుహాలులోనికి ప్రవేశించి నిలచి వుండిపోయాను. మేడమీద చక్కని మంజుల మృదు నాదముతో సన్నగా పాట వినబడింది. అరె బాఫ్ రే ఏమయిందీ! కొంపతీసి పొరబాటున ఈయింట్లో ప్రవేశించానాయేమి? మఱి శ్రీబాబు యిల్లు యిది కాదా!! ఇదే అయినట్టయితే స్త్రీకంఠం వినపడుతున్నదే!......నాదృష్టి ప్రక్కనున్న సోఫాపైకి మఱలింది. సోఫామీద పరిశుభ్రమైన దుస్తులతో అతిసుకుమారమైన యిద్దరుపిల్లలు శ్రద్ధగా చదువుకొంటున్నారు. అందులో మగకుర్రాడు నన్ను చూసి సోఫాదిగి నుంచున్నాడు నన్నువిస్తుపోయి చూస్తూ. అతని చెల్లెలు నన్ను నఖశిఖపర్యంతము ఓమారు సూటిగా చూసింది. ఆమె పెదిమలపై చిఱునవ్వు తాండవించింది. అన్నను సంబోధిస్తూ 'ఏమి గుర్తుపట్టలేదు?' అన్నది. ఆకుర్రాడు మారుపల్కలేదు. అప్పుడా అమ్మాయి సోఫాదిగి నాకు సమస్కరించి ''కూర్చోండి. బాబాయ్ కొద్దిసేపట్లో తిరిగివస్తారు'' అని నాకు మఱొకసోఫా చూపించింది.

నేను ఆసోఫాలో ఆసీడనాబోతూండగా వో పాతికేళ్ల యౌవనస్త్రీ — మెడకు స్టెతస్కోపు ప్రేలాడుతున్నది — చేతిలోని హేండ్ బాగ్ వయ్యారంగా త్రిప్పుతూ, మందస్వరంలో 'నైయాదుల్హాన్ — మెహూం నహీ నయాదుల్హాన్' అని పాడుతూ మేడమెట్లు దిగుతున్నది. నన్ను చూడటంతోనే పాట ఆపివేసి సిగ్గుపడి నెమ్మదిగా మెట్లుదిగింది. ఆమె లేడీడాక్టరని గుర్తుపట్టడమిహ యెంతోసేపు పట్టలేదు. శ్రీబాబుయింటికి లేడీడాక్టరు ట్రీట్ చేయడానికి యెందుకు రావలసివచ్చిందబ్బా! యని సందేహం బుర్రలో చొరబడ్డది. ఆమె మెట్లుదిగివచ్చి నాకు నమస్కరించింది, 'యెవరికొరకని' ప్రశ్నిస్తూ. నేను తిరిగి నమస్కరిస్తూ జవాబుచెప్పేలోపల ఆ పాప 'బాబాయ్‌కొఱకు పిన్నీ' అన్నది. ఆసంబోధన నన్ను మఱింత విస్మయుడ్ని చేసింది. సరే అదిఅలా వుండనీయండి, ఆడాక్టరమ్మ నన్నుకూర్చోమని సగౌరవంగాచెప్పి వంటవాడ్ని కేక వేసింది. వాడు వచ్చీ రావడంతోనే నన్నుగుర్తుపట్టి 'ఓహో! కేశవబాబుగారా! — ఎప్పుడు వచ్చారు?' అని పల్కరించాడు. డాక్టరమ్మ 'తాతా! బాబుగారికి కాఫీతెచ్చిఇవ్వు.' అనిచెప్పి నావంకతిరిగి 'క్షమించండి! అర్జంటుకేసు మీద వెళ్తున్నాను. వారు కొద్దినిముషాల్లో వేవస్తారు' అనిచెప్పి మరొకసారి నమస్కరించి వెళ్లిపోయింది.

ఆ చిన్నమ్మాయి తన అన్నగారికి యేమి గుర్తులు జ్ఞాపకంచేసిందో యేమోకాని ఆ కుర్రాడు కూడ నన్ను గుర్తుపట్టాడు. నేను కాఫీకప్పు నోటిముందు పెట్టుకొనబోయేసరికి శ్రీబాబు లోపలికి ప్రవేశించాడు. నన్నుచూసి 'ఓహో ఎప్పుడు వచ్చావురా?' అంటూ పరుగునవచ్చి సోఫాలో కూర్చున్నాడు కావలేసుకొంటూ.

"నేనెప్పుడో ఒకప్పుడు వచ్చానులే. కాని-నీకథ యేమిటి మరీ విచిత్రంగావున్నదే" అన్నాను. దానికి వాడు పకపక నవ్వేసాడు.

"సావకాశంగా తర్వాత తెలిసికొందువుగాని ముందు కాఫీ పూర్తిచెయ్యి" అనిచెప్పి సగం కొరికిన బిస్కట్ నా చేతిలోంచి తీసుకొని తిన్నాడు. కాఫీ పూర్తయిన తర్వాత "గోపాల్" అని ఆ చదువుకొంటూన్న పిల్లవాడ్ని పిలిచాడు. "ఉమా! నీవుకూడా రామ్మా" అని ఆ అమ్మాయినికూడ కేక వేసాడు. వాళ్ళిద్దరూవచ్చి మాముందు వినయంగా నుంచున్నారు.

శ్రీబాబు వాళ్ళని "వీరెవరో తెలుసునా! గుర్తున్నదా!" అన్నాడు నన్ను చూపుతూ. తడుముకోకుండా వాళ్లు ఒక్కసారిగా "కేశవ్ బాబాయ్" అన్నారు. ఆ సంబోధన వినేప్పటికి నాఒళ్లు పులకరించింది. ఎంతో ఆనందమయింది. నా హృదయం ఆర్ద్రితతో నిండిపోయింది.

గోడ గడియారం పదకొండు కొట్టింది. "ఇహ నేను వెళ్ళవస్తాన్రా" అన్నాను. దానికి శ్రీబాబు "ఎక్కడకు వెళ్తావ్ వారంరోజులు యిక్కడ వుండకుండాను" అన్నాడు. నేనుండలేను క్షమించమన్నాను. దానికి వాడు కోపంగా "నేనెంతో యిదిగా అడిగాను. తర్వాత నీ యిష్టం" అని నిష్ఠూరమేశాడు. సరేలే, బట్టలు అవీ తెచ్చుకొంటానన్నాను. దానికి వాడు నే తెప్పిస్తానులే అని కూర్చోబెట్టాడు.

చాకలి నీళ్ళుతోడి నన్ను పిలిచాడు. నేను స్నానానికి లేచాను. శ్రీబాబు లోనికివెళ్ళి నాకని క్రొత్తపంచె పట్టుకువచ్చాడు. ఇదెందుకురా! నీపంచే యివ్వరాదా! అన్నాను. వాడు వినేమనిషిగనుకనా.

వంటవాడ్ని ఆ యింట్లో అందరూ తాతా! అని ప్రేమతో గౌరవంగా పిలుస్తారు. పెద్దలులేని ఆ యింట్లో అతడే పెద్దగా ప్రవర్తిస్తాడు. ఇంటివాడిలానే మెలగుతాడు యెంతో బాధ్యతతో. తాత స్వయంగా మా యిద్దరకూ వడ్డించాడు. మేం భోజనం చేయడం మొదలుపెట్టాం. ప్రక్కగదిలో పిల్లలకు భోజనం పెట్టినట్టున్నారు. డాక్టరమ్మ దగ్గరవుండి పిట్టకథలు చెప్పుతూ అన్నం తినిపిస్తున్నట్టున్నది. ఆమె మాటలు, మధ్య మధ్యను ఆ పిల్లలువేసే అమాయకపు కొంటిప్రశ్నలు, వాటికామె యిచ్చే చిత్రపు జవాబులు వినపడుతున్నాయ్. శ్రీబాబు శాఖాఖాని తేబోయి యేదో ప్రసంగమెత్తాడు. నేను ఆపివేయమని సౌంజ్ఞ చేసాను. నేనట్లా యెందుకన్నది—నా వుద్దేశమేమిటో కనిపెట్టినట్టున్నాడు. ఓ చిరునవ్వు నవ్వి వూరుకొన్నాడు. డాక్టరమ్మ ప్రవర్తన నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. చాలామంది డాక్టరమ్మలవలె లేదు యీమె. ఆమెకు ఆ పిల్లలంటే యెంత గారాబమో! ఎంత ప్రేమో! ఎంత అనురాగమో! ఎంత ఆర్ద్రితో! వారి ఆహారంగురించి యెంత శ్రద్ధో!......బహుశా మేము వింటున్నట్టు తెలిస్తే ఆమె యేమనుకొంటుందో? వెంటనే తన గొంతు వినపడకుండా ఆపివేసేదేమో!

మధ్యాహ్నం ఫలహారం చేస్తున్నాం. డాక్టరమ్మ రేడియో మీటరుత్రిప్పి మా ప్రక్కన ఓ కుర్చీలో కూర్చున్నది. రేడియోలో పిల్లల ప్రోగ్రాము వినపడుతోంది. ఉమా, గోపాల్ లు రేడియో దగ్గర కూర్చుని శ్రద్ధగా వింటున్నారు......నేను మాట్లాడుతూ శ్రీబాబును కొంచెం మర్యాదగా 'మీరు' అని సంబోధించడం మొదలుపెట్టాను. దానికి శ్రీబాబు "ఒరేయ్ కేశవ్! లేనిపోని క్రొత్త మర్యాదలు తీసుకు వస్తున్నావేమిట్రోయ్. ఏం— డాక్టరుగారున్నారనా ఆ మర్యాద" అన్నాడు. డాక్టరమ్మకు నవ్వొచ్చింది. ఆమె మొఖం ప్రక్కకు త్రిప్పుకొన్నది ఎటికెట్ సెన్స్ కొరకు. ఏదో అవీ ఇవీ మాట్లాడుకొన్నాం ముగ్గురమూను, నాకు డాక్టరమ్మనుచూస్తే యెంతో సంతోషమేసింది. ఆమెపై యెంతో గౌరవం కలిగింది. ఎంచేతనంటే ఆమెలో యేకోశానా గర్వం, అహంభావం, జుగుప్స అగుపడలేదు. ఆ Plainness, social nature, clear

understanding నాకు యెంతో ఆనందాన్నిచ్చింది. శ్రీబాబుకు తగినవ్యక్తనిపించింది. అనుమానాలు, అపభ్రంశలు, స్పర్ధలు, ఈర్ష్యలు, జుగుప్సలకు ఆ యింట్లో తావులేదని తెలిపోయింది.

సాయంకాలం శ్రీబాబు, నేను, డాక్టరమ్మ, ఉమ, గోపాల్—అంతాకలసి బీచికి షికారు బయల్దేరాం. బీచిలో యెంతహాయి అనిపించింది. నీటిపై నుంచివచ్చే అజలపూరిత కమ్మతెమ్మరలు, ఆనీటిలో తమ అందాన్ని చూసుకొంటున్న అస్తమితసూర్యుని అరుణకాంతులు యెంతో ఆనందాన్ని, సుఖాన్ని కల్గిస్తున్నాయ్. ఎవరి ఆనందంలో, ఉల్లాసంలో వారు లీనమైపోయి చరిస్తున్న అచ్చటి వివిధజనుల ఆప్రకృతి రమణీయతకొక అందాన్ని కల్గిస్తున్నారు. నేను, శ్రీబాబు వారందరికీ దూరంగా కూర్చున్నాం. డాక్టరమ్మ పైట నడుముకుబిగించి ఆపిల్లలతో ఆడుకొంటూన్నది. వారిని long jump దుమికిస్తున్నది. పరుగెత్తిస్తున్నది.

నేను వారిసంగతి చెప్పమని శ్రీబాబును ఒత్తిడి చేసాను. వాడు మొదలుపెట్టాడు—

"డాక్టర్ పద్మజదేవితో పరిచయం, స్నేహం కలగడం చాలా గమ్మత్తుగా జరిగింది. చాలా వింత విషయం."

"అప్పుడే రమ్యత, అందంవుంది" అన్నాను.

"అదిగో అప్పుడే మొదలుపెట్టావ్ నీ Comments అలా Comments కురిపించేట్లయితే నేనుచెప్పను. చెప్పలేను" అన్నాడు.

"లేదురాబాబు!" అన్నాను.

శ్రీబాబు తిరిగి మొదలుపెట్టాడు. "తొలిసారి ఆమెను నేనొక మిత్రునియింట్లో చూశాను. డెలివరీ కేసుపై ఆ ఇంటికి వచ్చింది. ఆమిత్రునిద్వారా నే పద్మజదేవి అవివాహితురాలని, క్రొత్తగా రెండేళ్ల క్రితమే డాక్టరుపరీక్ష ప్యాసయిందనీ, వారిది గౌరవనీయమైన కుటుంబమని, విశాఖపట్నంలో నేవారి తలిదండ్రులున్నారని, ఆమెచెల్లెలు డాక్టరు పరీక్షకు చదువుతున్నదని, తల్లిదండ్రులు దగ్గరవుండి జాగ్రత్తగా చదువు చెప్పిస్తున్నారని........మొదలైన విషయాలు తెలుసుకొన్నాను. ఆమె వెళ్లేటప్పుడు మిత్రుడు నన్నామెకు పరిచయంచేశాడు.

"ఒకరోజున సినిమాలో యెదురుపడటం తటస్థించింది. నేనామెకు సాల్యూట్ చేయబోయాను గానీ యెంచేతనో చేతిని షర్టుకాలరు సర్దుకొంటున్నట్లు మార్చేశాను. కళ్లల్లోమాత్రం Greet చేశాను. దానికామె జవాబివ్వటం జరిగింది అంతే ఆమె ప్రక్కనున్న నర్సులు ఆవిషయం గుర్తించలేదనే అనుకుంటాను.

"ఆతర్వాత ఒకటి రెండుసార్లు దార్లో ఎదురవడం తటస్థించింది. చూడనట్లు నటించేవాళ్ళం. కాని మా వాలుచూపులు ఢీకొనేవి.

"ఇలావుండగా వోరోజు నాకామె తనని కలుసుకోవలసినదిగా కోరుతూ వ్రాసిన వుత్తరం వచ్చింది. ఎంతో విస్మయాన్ని కల్గించింది."

"దేవుడు రక్షించాడు. రాయంచల రాయబారాలు—మేఘసందేశాలు కానందుకు ధన్యవాదాలు" అన్నాను.

"అదుగో నీకవిత్వధోరణి తిరిగి మొదలు పెట్టావ్" అన్నాడు శ్రీబాబు.

"లేదు లేదు. సిగరెట్టు కొంచం ముట్టించనియ్" అని సిగరెట్టు ముట్టించాను.

శ్రీబాబు చెప్పాడు. "రోజురోజుకు మా పరిచయం వృద్ధిపొంది స్నేహం ప్రేమగామారింది. ఇలా జరుగుతుందని యిరువురకూ తెలియకపోలేదు. ఓనాడు ఆసంగతీ బయటపడింది. పెండ్లి చేసుకోవాలని నిశ్చయించుకొన్నాం. కాని దురదృష్టవశాత్తు అను లేక నాతెలివితక్కువను, యేమైనా అనుకో గోపాల్ తల్లి ఇందిరాదేవి చనిపోయినదినం ప్రతి యేటా చేసినట్టు ఆయేడూ పదిమందిబీదలకు భోజనం

పెట్టించాను. తక్కిన మిత్రులతోపాటు డాక్టరు పద్మజనుకూడా ఆహ్వానించాను. ఆమెను పిలవడం పూరికే 'టీ'కి రావలసిందనిచెప్పాను. ఆమెవచ్చింది. ఆసమయంలో ఉమ నన్ను 'బాబాయ్' అని కేక వేయటం తటస్థించింది. ఆసంబోధన విన్నవెంటనే యెవ్వరికీ చెప్పకుండా పద్మజదేవి వెళ్ళిపోయింది.

"మఱునాడామె ఇంటికి వెళ్ళినప్పుడు నన్ను చూడటంతోనే కండ్లనిండా నీరు తెచ్చుకొని గిరుక్కున తిరిగి లోనికి వెళ్ళి తలగడలో తలదూర్చి పండుకొన్నది. నేను స్తబ్ధుడనై సోఫాలో కూలబడ్డాను. కొంతసేపటికి పద్మజదేవి లేచివచ్చింది. ఆమె రౌద్రాకారం తాల్చింది. తన్ను మోసం చేశానని, ఆమె జీవితాన్ని మట్టికలుప జూచానని, పిల్లలుండీ కూడా బ్రహ్మచారినంటూ కపటమాటలాడానని... ఎన్నో ఏకరువు బెట్టింది. దూషించింది. దుర్భాష లాడింది.

"ఆమె కొంచెం శాంతించాక నిజసంగతి ఇందిరాదేవి భర్త—ఉమా, గోపాల్ తండ్రి నా స్నేహితుడన్న మాట అతడు అకస్మాత్తుగా చనిపోవటం ఆ తరువాత కొన్ని అవాంతరాలవల్ల ఇందిరాదేవి కూడ చనిపోవటం ఆ అనాథులైన ఆ బిడ్డలను పోషించే భాగ్యం నాకు కల్గటం నీకు తెలిసిన విషయమేగా! ఉమా, గోపాల్ ఎలా ఎందుకు నా రక్షణలోనికి వచ్చినది విపులంగా తెలుపజెప్పాను. ఆమె కోపం తెలిమబ్బులా వీడిపోసాగింది. అంతా విస్మయంతో ఆలకించి నన్ను క్షమాపణ కోరుకొన్నది.

"మేము వివాహం చేసుకొన్నాం. నీకు ఉత్తరం వ్రాశాను. కాని అది నా వద్దనే వుండిపోయింది. అది పొరపాటున పోస్టులో వేయడం మఱచిపోయినట్టున్నాను. పెండ్లయినతర్వాత చిత్తు కాగితాల్లో కనపడింది. ఆ విషయాన్ని వేరే వ్రాయాలనుకున్నాను గాని సిగ్గుతో వ్రాయలేకపోయాను. క్షమించు మేం భార్యాభర్తల మయ్యాం కాని పిల్లలగొడవ తనకి పనికిరాదని తను ఆ ఇంట్లోనే వేరుగా ఉంటానన్నది పద్మజ. నేనేమీ అడ్డు చెప్పలేదు."

ఆ చివరి రెండుమాటలు వినేసరికి నాకాశ్చర్యం వేసింది. ఆవైపు చూసాను. అక్కడ పద్మజాదేవి గోపాల్‌తో ఇసుకలో 'మామాటిళ్ళ' ఆడుతూన్నది. ఉమ ఆమె వీపుమీదుగా వాలి చేతుల్తో ఆమె కంఠాన్ని కౌగలించుకొని వాళ్ళ ఆటను చూస్తూన్నది.

శ్రీబాబు నాతోపాటు అదృశ్యం చూసాడు. చూసి అన్నాడు. "చూసావా అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పో! ఆ మార్పు ఎలాకల్గిందో చెప్తున్నా విను. ఉమకు తీవ్రమైన జబ్బుచేసింది. పద్మజమే మందు ఇస్తున్నది. ఉమకు పరిచర్యలు చేయడం ఆ అమ్మాయివద్ద తీరిక లేకుండా కూర్చవడం నాపనైంది. తాత పగలల్లా పనుల్లో నిమగ్నుడైపోయేవాడు. రాత్రిళ్లు పెందలాడే నల్లమందు వేసుకొని మత్తుగా పండుకొనేవాడు. ఇహ, రాత్రింబవళ్లూ నేనే మేల్కొని వుండవలసి వచ్చేది. నా అవస్థ దేవుడికెఱుక...నన్ను, నా అవస్థను చూచి పద్మజకు కొంత జాలి కలిగివుండాలి. దానికితోడు ఓరోజు ఉమకు జ్వరతీవ్రత చాలా అపాయస్థితిలో వుంది. అంచేత పద్మజ ఇక్కడే వుండిపోయింది. ఆ సంఘటనే ఆమెలో కల్గిన మార్పుకు కారణం.... ఉమ, గోపాల్ ఆమెను 'పిన్ని' అని ప్రేమగా, ఆప్యాయంగా పిల్చేవారు. బహుశా అలా పిలవమని, ఆమె వాళ్ళకు పిన్ని అవుతుందని, తాత చెప్పి వుండవచ్చును. వాళ్ళు ఆమెయెడ ఎడమర లేకుండా తల్లివలె మెలగుటను, అంటిపెట్టుకొని తిరుగటము ఉమ 'పిన్నీ నాకు భయం వేస్తోంద'ని ఆమెను కౌగలించుకొనుటయు, అప్పుడామె ధైర్యం చెప్తూ ప్రక్కలో పండుకొనుటయు జరిగినయ్. మందుకు మాకుకు 'పిన్ని'నే పిలిచేది ఉమ...ఈవిధంగా ఆమె, ఆపిల్లలు రోజురోజుకు దగ్గరవారై

పోసాగారు, వారిమధ్య ప్రేమ, అనురాగము లత లల్లుకొనటం మొదలుపెట్టింది. అది కొంగ్రొత్త చిగురుల్ని దాల్చి పుష్పించి నేడింత అందమైనదిగా మారింది.” అని ముగించబోవుసరికి ఉమ మావద్దకు వచ్చి చెరొక యాపిల్ పండు, చక్రకేళీ ఇచ్చి వెళ్లింది. వాళ్లు ముగ్గురూ సంద్రపునీళ్లలో చేతులు పరిశుభ్రంగా కడుక్కొని వచ్చి మా ప్రక్కన కూర్చుని సంచిలో పండ్లను ఆఖరు చేసారు.

అప్పటి కప్పుడే వెన్నెలరేడు పరిపాలన సాగించాడు. ఆతని చల్లని దయామృతంలో జనావళి హాయి ననుభవిస్తోంది. మేం నెమ్మదిగా కదలి ఇంటికి పయనమయ్యాము.

శ్రీబాబు ఇంట్లో ఆ వారం రోజులు హాయిగా నిశ్చింతగా గడచిపోయినయ్. నిజంగా ఆ ఇల్లొక స్వర్గం. వారి సౌమ్యసంసారం ఆదర్శప్రాయం. అటువంటి సంసారాలు ఈ ప్రపంచంలో ఎన్ని వున్నాయ్? అక్కడ వారం రోజులు ఉన్నందుకు చాల లాభం పొందాననే చెప్పాలి. మరికొంత నాగరికత నేర్చుకొన్నాను. అనుమానాలు, వైషమ్యాలు, ఈర్ష్యా జుగుప్సలు లేని ప్రశాంతము, ఆనందమయము, ప్రేమపూరితము ఐన సంసారనౌకను దర్శించగల్గాను. ఆ ఆనందమయ వాతావరణాన్ని అనుభవింపగల్గాను.

అన్నిటికన్నా ముఖ్యము, నాకు నచ్చిన విషయం. ఆ పిల్లల నడవడి జీవితం క్రమానుబద్ధము, క్రమానుసరణము, క్రమానురాధనము కల్గిన ఆ జీవితసరణి ఎంత ఆహ్లాదజనకము, ఎంత సుందరమైనది. వాళ్లు ప్రొద్దున్నే నిద్ర మేల్కొంటారు. ప్రక్కలమీద కూర్చుని దైవప్రార్థన కావిస్తారు. అక్కడనుంచి లేచివెళ్లి తమ తల్లి ఫొటోకు నమస్కరిస్తారు.

కాలకృత్యాలుతీర్చుకొని స్నానంచేసిపరిశుభ్రమైన దుస్తులుధరించి తలదువ్వుకొని నీటుగాతయారవుతారు. కాఫీఫలహారం పూర్తిచేసినతర్వాత వాళ్ళు రీడింగ్‌రూమ్‌లో కూర్చుని చదువుకొంటారు. రీడింగ్ రూమ్ అంటే జ్ఞాపకమొచ్చింది. శ్రీబాబు ఆపిల్లలు చదువుకొనేందుకు వొగది ప్రత్యేకించాడు. ఆగది చాలా పరిశుభ్రమై, ధారాళముగా వాయుసంచారము గల్గినట్టిది; గది గోడలమీద నీతివాక్యములు పరిశుభ్రముగా సుంద్రముగా వ్రాయబడివున్నై. అలమారనిండా అనేక విధములైన గొప్పగొప్ప వ్యక్తులయొక్కయు, శిల్పలావణ్యాలు, ప్రకృతిరమణీయకములు మొదలుగాగల ఫోటో ఆల్బములున్నాయ్. ఇంకా బొమ్మలపుస్తకాలు చాలరకాలు వున్నాయ్. ఇంకా కథలపుస్తకాలు, నీతివాచకాలు, తేలికభాషలో వ్రాయబడిన వ్యక్తుల జీవితచరిత్రలు మొదలుగాగల పుస్తకాలలైబ్రరీ—అదే బీరువా వొకటివున్నది. గోడకు హిందూదేశము మేపు వ్రేలాడుచున్నది. గదికి మధ్యగా ఓ టేబిలు, మూడు కుర్చీలు వున్నాయ్. గదిలో ఓప్రక్కను ఎత్తయిన స్టూలు దానిమీద ఫ్లవర్‌పాట్ వున్నది. దాంట్లో రోజాపూలగుత్తుల నమర్చుతుంది ఉమ. ఇదీ ఆగది యొక్క అలంకారము. ఆగదిలో ప్రశాంతంగా చదువుకొంటారువాళ్లు. ఎనిమిదిన్నర గంటలకు ప్రయివేటు టీచరువస్తాడు. అక్కడున్న మూడవ కుర్చీ ఆయనకోసమే. అంతచక్కని వాతావరణాన్ని కల్గించి ఆలేతమనస్సులో ఆదర్శప్రాయము కనుసరణీయమైన విద్యను యిస్తున్నాడంటే శ్రీబాబుకు ధన్యవాదాలర్పింపకుండా వుండలేరెవ్వరును. చూశారూ ఆఫోటో ఆల్బములు పిల్లలమనస్సులో యెట్టి ఉత్కృష్టభావాల్ని కల్గిస్తవో, యెట్టి ఆశాజీవులై ఉన్నతమార్గానురక్తులగుటకు కార్యాచరులను గావిస్తుందో.

ప్రతిదినము తప్పకుండా రేడియోలో పిల్లల ప్రోగ్రాము వింటాగు.

అన్నాచెల్లెలిద్దరూ ఇంట్లోనే ఆడుకొంటారు. వారికితర పిల్లలతో స్నేహంలేదు, దీనిక్కూడా

కారణం 'నేనే' నని శ్రీబాబు వెల్లడించాడు. వాళ్ళకు శ్రీబాబు అంటే వినయవిధేయతలతో కూడిన భయంవుంది. శ్రీబాబు యెక్కడ చనువైపోతానో యని తరచువాళ్ళతో మాట్లాడడు. దూరదూరంగా వుంటాడు. కాని అతడికి వాళ్ళమీద ఎంతో ప్రేమ; అనురాగము అలానే అతనిపైవాళ్ళకును. 'బాబాయ్' అనిపిలిచే సంబోధనలోనే ఆవిషయిం వ్యక్తమౌతుంటుంది. ఆపిల్లలకు 'పిన్ని' దగ్గర చాలా గారాబము, చనువున్నూ. బిస్కెట్టుసరులు, కోపాలు, మారాములు, నవ్వుపువ్వులు అన్నీ పిన్నివద్దనే. అవి ఆమె కెంత వినుగును కల్గిస్తాయో దానికి రెట్టింపు ఆనందాన్నిస్తాయి. ఆ అనుభూతులమధ్య వారిజీవితాలు వినూతన శిఖరాల నందుకొన్నాయ్.

సాయంకాలం 'పిన్ని' 'బాబాయ్'లతో కలసి బీచికో, పార్కుకో, షికారుకో వెల్తారు.

రాత్రి భోజనాలనంతరం ఓఅరగంట పుస్తకాలు ముందు వేసుకొని కూర్చుంటారు. పెందలాడే పక్క లెక్కుతారు. పక్కలమీద చేతులు కట్టుకుని నిశ్చలంగా కూర్చుని పిన్నిచెప్పే ప్రైకస్తుతి శ్లోకాల్ని పునఃశ్చరిస్తారు. ఆతర్వాత పిన్నిచెప్పే కథల్ని వింటూ వింటూనే నిద్రపోతారు.

ఇదీ ఆ పిల్లల నిత్యకృత్యం. క్రమబద్ధము, క్రమానుసరణము, క్రమారాధనము కల్గిన ఆ పిల్లలిద్దరిజీవితం పరికించిన కొద్దీ ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని, ఆనందాన్ని, అనుభూతిని కల్గిస్తుంది. అటువంటి పిల్లల్ని చూస్తే ఎవరికి ముచ్చట కల్గదు? వారిని ఆశీర్వదించకుండా ఎవరుండగలరు? భావిలో ఒక వినూత్న చరిత్ర కలవారగుదని ఎవరు దీవింపరు?? ముందున కొక అత్యున్నత స్థానాన్ని ఆక్రమింపవలెనని ఎవరు ఆశింపరు???

ఆరోగ్య సుఖమయ సంతోష జీవనానికి

# బిజలీవటి



కొందరికి సహజబలం వుంటుంది. కొందరికి వుండదు. అలానని వారు బాధా జీవనమా గడపడం?

మీకు అతి శీఘ్రంగా బల ఉత్సాహాల విద్యుచ్ఛక్తి కావాలంటే,— బిజలీవటి వాడండి.

80 మాత్రలు
రు. 2-0-0
పోస్టేజి వేరు.

నేడే వ్రాయండి:

శ్రీ శృంగార్స్, 15 న్యూ స్ట్రీట్, మన్నడి, మద్రాస్.

SRI SRINGARS, 15 New Street, Mannady, Madras.